క్లుప్తంగా

అలరించిన కూచిపూడి బృంద నాట్య పోటీలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ఆలయ ప్రాంగణంలోని శ్రీపద్మావతి కళావేదికపై ఆదివారం కూచిపూడి బృంద నాట్య– కళాకృతుల తయారీ పోటీలు నిర్వహించారు. సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధరబాబు ఆధ్వర్యంలో భరతమాత పూజా దినోత్సవాలు జరగ్గా, ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంక విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వర్తించిన కూచిపూడి బృంద నృత్యాలు అలరించాయి. చిన్నారులు ఉత్సాహంగా రంగోలి పోటీల్లో పాల్గొనగా, వివిధ రకాల ముగ్గులు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రెండో రోజు కొనసాగిన పట్టాభిషేక మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక మారుతినగర్ శ్రీకంచి కామకోటిపీఠ మారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రీమద్ వాల్మీకి రామాయణ అష్టోత్తర శత పారాయణ పూర్వక శ్రీరామమహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు రెండో రోజుకు చేరాయి. ఆదివారం ఉదయం రామాయణ పారాయణాలు ప్రారంభమయ్యాయి. శ్రీమద్ రామాయణంలో 24 వేల శ్లోకాలకు హోమ కార్యక్రమం విశేషంగా నిర్వహించారు. సూర్య నమస్కారాలు చేపట్టగా, సాయంత్రం యథావిధిగా పారాయణి చేపట్టారు. అర్చన హారతి నీరాజనం మంత్రపుష్పాలు స్వామికి దర్బార్ సెలెబ్టెడ్ సేవ నిర్వహించారు. తీర్థ ప్రసాద వితరణ జరగ్గా, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మోసం చేసిన కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



నెహ్రూనగర్: హైదరాబాద్‌కి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 585 మంది నుంచి డిపాజిట్లు రూపేనా రూ.6 కోట్లు సేకరించి వారికి తిరిగి డబ్బును చెల్లించకుండా మోసం చేసిన కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులను కలసి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం తగిన చొరవ తీసుకుని ప్రత్యేకంగా పోలీస్ అధికారులను నియమించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భూపతి సునీల్ కుమార్, చంద్రనాయక్, మాణిక్యరావు, బాబు, సుబ్బయ్య, నాగేశ్వరరావు, సతీష్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు

లక్ష్మీపురం: మద్యం తాగి ఇద్దరు ఇతరులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు..కృష్ణానగర్ రైతు మార్కెట్ దగ్గర చంద్రమౌళినగర్‌కు చెందిన జాన్‌పాల్, శ్రీకాంత్ బహిరంగ ప్రదేశంలో కూర్చొని మద్యం తాగి గట్టి గట్టిగా కేకలు వేస్తు వచ్చిపోయే స్థానికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. వాహనదారులకు ఆటంకం కల్పిస్తుండడంతో హెడ్ కానిస్టేబుల్ స్వర్ణసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ద్విచక్ర వాహనం చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్యామలానగర్ ప్రాంతానికి చెందిన మేడ ధనగోవింద్ వ్యాపారం చేస్తుంటాడు. 2024 అక్టోబర్ 23వ తేదీ పాత స్వామి థియేటర్ స్థలంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్‌కు మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై భార్యతో కలసి వెళ్లారు. షాపింగ్ చేసి తిరిగి బయటకు వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల, బస్టాండ్, రైల్వే స్టేషన్, సైకిల్ స్టాండ్‌లను పరిశీలించగా ఎంతకు వాహనం కనిపించక పోవడంతో పట్టాభిపురం పోలీసులకు ఆదివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జిల ఏలుబడి ఇంకెన్నాళ్లు..

- కార్యదర్శుల కొరత.. కొరవడిన పర్యవేక్షణ
- మొత్తం 29 గ్రామాలు.. 10 పంచాయతీలకు కార్యదర్శులు లేరు
- ఇన్‌చార్జిలతో కొనసాగుతున్న గ్రామాలు
- గ్రామాల్లో మందగించిన అభివృద్ధి

పొన్నూరు: మండలంలో పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతోంది. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వినే దిక్కులేదు. పొన్నూరు మండలంలోని 10 గ్రామాలకు శాశ్వత కార్యదర్శులు లేకపోవడంతో ప్రజలు సమస్యలు పరిష్కారం కాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌చార్జి కార్యదర్శులు రెండు, మూడు గ్రామాలకు బాధ్యతలు నిర్వహిస్తుండటంతో ఏ గ్రామంలో అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాలకు అందుబాటులో లేని కారణంగా ప్రజలు ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యను పరిష్కరించడంలో మండల పరిషత్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పది పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులే

మండలంలో మొత్తం పంచాయతీలు 29 ఉండగా ప్రస్తుతం 19 గామాలకు మాత్రమే కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 10 గ్రామాలైన మన్నవ, మునిపల్లె, వడ్డిముక్కల, చింతలపూడి, ఉప్పరపాలెం, మాచవరం, ఆరెమండ, కొండముది, దండమూడి, పెదపాలెం గ్రామాలకు ఇన్‌చార్జ్ కార్యదర్శులుగా ఉన్నారు.



పొన్నూరు ఎంపీడీఓ కార్యాలయం

స్తంభించిన గ్రామ పాలన..

కార్యదర్శుల కొరతతో కార్యదర్శికి రెండు నుంచి మూడు పంచాయతీలు అప్పగించడంతో మండలంలో గ్రామ పాలన దాదాపు స్తంకార్యదర్శుల కొరతతో స్తంభించిపోయింది. రక్షిత తాగునీటి పథకాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. వీధిలైట్ల నిర్వహణ, జనన, మరణ రిజిస్టర్ల నిర్వహణ, పన్ను విధింపు, వసూలుతో పాటు పలు విభాగాల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. పలు పంచాయతీల్లో ప్రజలు కార్యదర్శుల కోసం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. వ్యయ ప్రయాసలతో అక్కడికి వెళ్లినా కార్యదర్శులు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శులు ఉన్నా వారు ఎప్పుడు. ఎక్కడ ఉంటారో తెలియక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చింది. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే సమర్థులైన అధికారులు ఉండాలి. గ్రామస్థాయి అధికారులు అందరూ ఉంటే సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. కార్యదర్శులు లేని గ్రామాలకు అధికారులను నియమించేందుకు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తిస్థాయి కార్యదర్శి లేక ఇబ్బందులు

గ్రామానికి కార్యదర్శి పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీకి సంబంధించిన పనులలో జాప్యం ఏర్పడుతోంది. వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి గ్రేడ్ 1 పంచాయతీకి శాశ్వత కార్యదర్శిని ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

–ఎం.తిరుపతయ్య, సర్పంచి, ఉప్పరపాలెం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పంచాయతీ కార్యదర్శుల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కార్యదర్శులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వివరించాం. సాధ్యమైనంత వరకు ఉన్న పంచాయతీ కార్యదర్శులతోనే ప్రజలకు సేవలు అందించేలా చర్యలు తీసుకొంటున్నాం.

–చంద్రశేఖర్, ఎంపీడీఓ, పొన్నూరు

సంస్కృత కళాశాల అ'పూర్వ' సమ్మేళనం

పొన్నూరు: తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువులు మన భవిష్యత్‌కు పునాదులు వేస్తారని విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ వేదాల వెంకట సీతారామాచార్యులు అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శ్రీ భావన్నారాయణ స్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీతారామాంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజానికి ఎంతో ఉన్నతమైన వ్యక్తులను అందించిన ఘనత సంస్కృత కళాశాలకే దక్కుతోందని అన్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ కళాశాలలో ఎంతోమంది విద్యనభ్యసించి అష్టావధానులుగా, శతావధానులుగా, నేత్రావధానులుగా, కీర్తి ప్రతిష్టలు గడించారని పేర్కొన్నారు. అనేక మంది సరస్వతీపుత్రులను అందించిన ఘనత ఈ కళాశాలకే దక్కుతుందన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులు ఈ కళాశాలలో ఉండడం వల్లే ఇక్కడ చదివిన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు లభించిందన్నారు. భావ దేవుని ఆశీస్సులు మెండుగా ఉండటం వల్ల రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఎంతోమంది విద్యార్థులు ఇక్కడికి విచ్చేసి విద్యనభ్యసించి విద్యా సుగంధాలను రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో అందిస్తున్నారని తెలిపారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులందరూ ఈ సమావేశంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ఎంతోమంది ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తెలుగు పండితులుగా పనిచేసి విశ్రాంతి తీసుకుంటున్న వారు పాల్గొనడం విశేషమన్నారు. ఈ సందర్భంగా వేదాల వెంకట సీతారామాచార్యులను విద్యార్థులందరూ తమ భుజాలపై ఎత్తుకొని వేదికపైకి చేర్చి ఆయనపై పుష్ప వర్షం కురిపించారు. అనంతరం శ్రీమాన్ సీతారామాచార్యులు వారిని దుశ్శాలువాలు, మెమొంటోలను అందించి ఘనంగా సత్కరించారు.



వేదాల వెంకట సీతారామాచార్యులును సత్కరించిన పూర్వ విద్యార్థులు

పంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

చేబ్రోలు: చేబ్రోలులో అక్రమంగా తొలగించిన పంచాయతీ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం చేబ్రోలులో ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి డిగ్రీ కాలేజి వరకు ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆందోళన చేస్తున్న కార్మికుల కుటుంబాల దగ్గరకు వెళ్లి మీ పెన్షన్లు ఆపివేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చూస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు సీహెచ్ హనుమంతరావు, రాఘవమ్మ, పార్వతి, వెంకాయమ్మ, సరళ, జ్యోతి, దివ్యశ్రీ, దీపిక పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సైన్స్ ఎగ్జిబిషన్‌లో నారాకోడూరు విద్యార్థిని ప్రతిభ

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన నజ్మా

చేబ్రోలు: జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో చేబ్రోలు మండలం నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి ఎగ్జిబిషన్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు ఆదివారం తెలిపారు. 4వ తేదీ గుంటూరులో జిల్లా స్థాయి సైన్స్ పోటీలలో ఎస్‌కే నజ్మా ఉత్తమ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయికి ఎంపికై ంది. విద్యార్థిని జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక ఇతర అధికారుల నుంచి మెమోంటో, మెరిట్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. వ్యక్తిగత విభాగంలో ఎస్.కె.నజ్మా, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు కోసం తయారుచేసిన సరివ్వింగ్ రోబోట్ 'ఎగ్జిబిట్ రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. జనవరి 7వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు గుంటూరు తరఫున పాల్గొననుంది. జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలో నారాకోడూరు హైస్కూల్ విద్యార్థులు మౌర్య భూషణ, కే బాల భవ్యశ్రీ, హారికలు తృతీయ స్థానంలో నిలిచారు. ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు, మండల విద్యాశాఖాధికారి ఆర్.సుబ్బారావు అభినందించారు.



డీఈఓ రేణుక నుంచి మెమొంటోను అందుకుంటున్న నజ్మా, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నిరుపయోగం...



మున్సిపాలిటీ పరిధిలో మరుగుదొడ్ల ట్యాంకులు శుభ్రం చేసేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మంజూరు చేసిన సెప్టిక్ ట్యాంక్ వాహనం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. రూ.లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన వాహనం వినియోగానికి నోచుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.

–పొన్నూరు

అస్తవ్యస్త ఆహార, జీవనశైలితో మూత్ర పిండాల సమస్యలు

డాక్టర్ కిలారి సునీల్ కుమార్

లక్ష్మీపురం: మధుమేహం, అధిక రక్తపోటు, అస్తవ్యస్త ఆహార జీవనశైలే మూత్ర పిండాలు దెబ్బతినటానికి కారణాలని, సైలెంట్ కిల్లర్‌గా పేరొందిన ఈ కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కిలారి సునీల్ కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ చాపకింద నీరులా నిశ్శబ్దంగా రహస్యంగా జబ్బు పడేతత్వం మూత్ర పిండాలకు ఉందన్నారు. మూత్ర పిండాల వ్యాధులు ప్రారంభ దశలో బయట పడవని, మూడో దశ నుంచి కొన్ని లక్షణాలు బయటకు పడతాయని వివరించారు. అనంతరం సంస్థ సభ్యులకు పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. సంస్థ సభ్యులు, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి డాక్టర్ కిలారి సునీల్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శాసనమండలి కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఆదివారం లక్ష్మీపురంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈ నెల 7, 8, 10వ తేదీల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్, 10వ తేదీన కర్నూలు కమిషన్ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు వింటుందని వివరించారు. సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పేర్లు నమోదు చేసుకుని పాల్గొనవచ్చని సూచించారు. పేర్లు రిజిస్ట్రేషన్ కోసం స్థానిక విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో(ఎస్ఈ ఆఫీస్) లేదా ఏదైనా విద్యుత్ డివిజనల్ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

పొన్నూరు: కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు తక్షణమే అందించాలని ఏఐవైఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సంఘం నియోజకవర్గ మహాసభ ఆదివారం నిర్వహించారు. సభకు పరిగిరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ప్రజానాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు పాల్గొన్నారు. చైతన్య మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, వారి సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు రెండు లక్షల 65 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి అమలు చేయలేదని పేర్కొన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు హామీ అమలు పరచలేక పోయారని, వలంటీర్లకు పదివేల రూపాయలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వారిని విధుల నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తల్లికి వందనం వచ్చే సంవత్సరం నుంచి అమలు చేస్తానని దాటవేస్తున్నాడని అన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు, తల్లికి వందనం రూ.15 వేలు తక్షణమే చెల్లించాలని, మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చైతన్య డిమాండ్ చేశారు. అనంతరం నియోజకవర్గ ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పరిగరాజు, గోపిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రచయిత దేవరకొండ శ్రీనివాస్, చేబ్రోలు బసవ పున్నయ్య, గజ్జల మల్లికార్జునరావు, గజ్జల శ్రీనివాసరావు, కోట కాంతారావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న చైతన్య

జొన్నలగడ్డలో వ్యవసాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఏరువాక కేంద్రం, బాపట్ల వ్యవసాయ కళాశాల, రావేప్ శిక్షణ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో జొన్నలగడ్డ గ్రామంలో వ్యవసాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వ్యవసాయ ప్రదర్శనను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానాలను పాటించాలని, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ వ్యవసాయ విధానాలను అనుసరించాలని సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసన్నరాణి మాట్లాడుతూ మూడు నెలల పాటు తమ కళాశాల విద్యార్థినులు జొన్నలగడ్డ, నిడుముక్కల, లేమల్లెపాడు, అనంతవరంపాడు, వట్టిచెరుకూరు గ్రామంలో వ్యవసాయ యాజమాన్య విధానాలలో పాల్గొని పంటల సరళి విధానాన్ని తెలుసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వెంకటరాములు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ యల్లా జేషు చౌదరి, డాక్టర్ ఎం.గంగాదేవి, హర్టికల్చర్ యూనివర్శిటీ ప్రతినిధి డాక్టర్ క్రాంతిరేఖ, రాధిక రమ్య, ఏఓ సుబ్రహ్మణ్యం, కోరమండల్ ఫర్టిలైజర్ లిమిటెడ్ ప్రతినిధి తిరుమలరావు, నామ శ్రీనివాసరావు, వంగా నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటి కంట్రోల్ సిబ్బంది, ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం కమిషనర్ లాంచెస్టర్ రోడ్, సాయికృష్ణ నగర్, ఆనందపేట, బీఆర్ స్టేడియం రిజర్వాయర్ ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది రికార్డు చేయాలని కోరారు. ఎమినిటి కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పనులను ప్రతి రోజు పరిశీలించాలని, నాణ్యతలో లోపం గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలని ఆదేశించారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, ప్రాధాన్య క్రమంలో చేపడతామని వివరించారు. అలాగే నగరంలో మెరుగైన పారిశుద్ధ్య పనులు జరిగేందుకు డివిజన్ల పునర్విభజన చేశామని, పనులకు అవసరమైన వాహనాలు, పుష్ కాట్స్, బిన్లు అందించినందున, శానిటరీ ఇన్ స్పెక్టర్లు క్రమ పద్ధతిలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటింటి చెత్త సేకరణ, డ్రెయిన్ల శుభ్రం, గ్యాంగ్ వర్క్ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో శుభ్రం జరగాలన్నారు. పర్యటనలో ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్ స్పెక్టర్ అంగడి రాజేష్ పాల్గొన్నారు.



పనులపై ఆరా తీస్తున్న కమిషనర్

జీజీహెచ్‌లో ఏడు నూతన ఓపీ కౌంటర్లు ప్రారంభం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగంలో ఆదివారం నూతనంగా నిర్మించిన ఏడు ఓపీ కౌంటర్లను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నజీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఏడాది కాలంలో కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా గుంటూరు జీజీహెచ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆదేశాలతో ప్రభుత్వ నిధులు, కార్పొరేట్ సంస్థల సహకారంతో జీజీహెచ్‌ను పూర్తిగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అవసరమైన సిబ్బందిని రిక్రూట్ చేస్తామని, ఆరు నెలల్లో నిధులు సేకరించి అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. సాహో జీజీహెచ్ అనే నినాదం ద్వారా సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్ వి రమణ ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టి కార్పొరేట్ వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులు ఓపీ చీటీ కోసం ఎక్కువ సమయం వేచి చూడకుండా సుమారు రూ.15 లక్షల తో ఏడు ఓపీ కౌంటర్లను నిర్మించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ తెలిపారు. నూతన ఓపీ కౌంటర్లు అందుబాటులోకి రావటంతో నిత్యం రద్దీగా ఉండే పొరుగు సేవలు వైద్య విభాగంలో ప్రజలకు మెరుగైన సేవలను అందించవచ్చన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి

లక్ష్మీపురం: మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిని సావిత్రీబాయి పూలే అని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ అన్నారు. బ్రాడీపేటలోని సావిత్రీబాయి పూలే జయంతి వారోత్సవాలలో భాగంగా సుందరయ్య నగర్, అంబేడ్కర్ నగర్‌లలో జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు చదువు కావాలని చదువు ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలరని సావిత్రీబాయి పూలే ఎంతోమందికి చదువు నేర్పించడమే కాకుండా ఎన్ని స్కూళ్లను స్థాపించడంలో పూలే దంపతులు ఎనలేని కృషి చేశారన్నారు. ఆడపిల్లల చదువు కోసం పాటుపడిన వ్యక్తిని ఈ సందర్భంగా మనం స్మరించుకోవాలి అన్నారు. ఎన్నో అవమానాలను దాడులను ఎదుర్కొన్న మహిళ సావిత్రి అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు జి.రమణ, ఎ.కళ్యాణి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కే పద్మ, అంగన్వా నాయకురాలు రాధా సంధ్యా సుజనారాణి పాల్గొన్నారు.

గీతా మందిరం అభివృద్ధికి కృషి చేయాలి

నెహ్రూనగర్: గీతా మందిరానికి పూర్వ వైభవం తెచ్చిన ఘనత వెలుగూరి అభయశ్రీ రత్నప్రసాద్ సొంతమని శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. చైర్మన్‌గా ఆర్యవైశ్యుల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా గీతా మందిరాన్ని ఆయన కొత్త వెలుగులతో తీర్చిదిద్దారని అభినందించారు. ఆర్ అగ్రహారంలో ఆదివారం గీతా మందిరం చైర్మన్ వెలుగూరి అభయ శ్రీ రత్న ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు టీఎల్వీ వీరాంజనేయులు, దేవరశెట్టి చిన్ని, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పడాల సుబ్బారెడ్డి, దూపాటి వంశీ, అచ్చాల వెంకటరెడ్డి, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, బి.దేవానంద్, వెంకటరమణ, బాబు, గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.